క్లుప్తంగా

వీరబాబు గుడి ప్రత్యేక పూజల్లో వెలంపల్లి



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వెనుక ఉన్న శ్రీవీరబాబు స్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన పుష్పయాగం, ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో యాగం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసిన దేవస్థానం కమిటీ సభ్యులను అభినందించారు.

రోడ్ సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా యర్రంశెట్టి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్ సేఫ్టీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా యర్రంశెట్టి అంజిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయనను నియమిస్తూ రోడ్ సేఫ్టీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్కే దుర్గా పద్మజ గాంధీనగర్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజల్లో చైతన్యం నింపి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. తనను ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన దుర్గా పద్మజకు యర్రంశెట్టి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

శతాబ్దాల చరిత.. సెంటినరీ ఘనత

- నేడు సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి 125వ ప్రతిష్ట మహోత్సవం
- నగరంలో మొదటి సీఎస్ఐ చర్చిగా ప్రసిద్ధి
- పలు చర్చిలకు కేంద్రంగా నిర్వహణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బెజవాడ పాతబస్తీ అనేక శతాధిక చర్చిలకు కేంద్రంగా ఉన్న విషయం తెలిసిందే. అందులో ఒకటి పాతబస్తీలోని సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి ఒకటి. సీఎస్ఐ సంస్థ ఆధ్వర్యంలో 1901లో దీని నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ఈ చర్చి శాఖోపశాఖలుగా విస్తరించి క్రైస్తవ ఆధ్యాత్మిక భావాలను విస్తరింపజేయటంతో పాటుగా సమాజానికి విస్తృతమైన సేవలను అందించి అందరి మన్ననలను అందుకుంది. పాతబస్తీలో 1858లో ఆంగ్లో వెర్నాక్యులర్ పాఠశాల (ప్రస్తుత గాంధీజీ మున్సిపల్ హైస్కూల్)ను ప్రారంభించారు. దీని ద్వారా స్థానికంగా క్రైస్తవ సువార్తను నిర్వహించారు.

జాన్ హారిసన్ ఆధ్వర్యంలో...

నాటి క్రైస్తవ ప్రముఖుడు జాన్ హారిసన్‌ను 1867లో సీఎంఎస్ మిషనరీగా బెజవాడ మిషన్ డిస్ట్రిక్ట్‌కు పంపించారు. ఆయన బెజవాడను కేంద్రంగా చేసుకొని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవ మిషనరీ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ప్రస్తుత గాంధీహిల్ పైన బంగ్లాను నివాసంగా ఏర్పాటు చేసుకొని తన కార్యక్రమాలు కొనసాగించారు. అదే క్రమంలో జాన్ హారిసన్ 1900 సంవత్సరంలో అప్పటి మద్రాస్ బిషప్ హెన్రీవైట్‌హెడ్‌చే



సెయింట్ పాల్స్ చర్చి తొలి నాటి చిత్రం

ప్రస్తుతం ఉన్న సెయింట్ పాల్ చర్చికు పునాది రాయి వేయించారు. అదే ఏడాది డిసెంబర్ 24 నాటికి దానిని పూర్తి చేశారు. 1901 ఫిబ్రవరీ 17వ తేదీన సెయింట్ పాల్స్ చర్చిగా నామకరణం చేసి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఈ చర్చి ప్రాంగణంలో వేలాది మంది సభ్యులుగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ చర్చి కాలక్రమంలో గోల్డెన్ జూబిలీ, ప్లాటినమ్ జూబిలి, సెంచరీ పూర్తి చేసుకొని ప్రస్తుతం 125 ప్రతిష్ట మహోత్సవాలను జరుపుకుంటుంది.

పలు చర్చిలకు కేంద్రంగా

సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి గడిచిన 125 సంవత్సరాల్లో అనేక ప్రాంగణాలకు అండగా నిలిచింది. వాటి నిర్వహణకు కేంద్రంగా కొనసాగుతుంది. నగరంతో పాటుగా జిల్లాలోని పలు చర్చి ప్రాంగణాల నిర్వహణను పర్యవేక్షిస్తుంది. గొల్లపూడి, భవానీపురం, విద్యాధరపురం, వించిపేట, టైనర్‌పేట, వణుకూరు, ఇలా అనేక చర్చి ప్రాంగణాలు ఈ సెంటినరీ చర్చి నిర్వహణలో కొనసాగుతున్నాయని చర్చి ఇన్‌ఛార్జి రెవరండర్ డాక్టర్ బి. ఆనందరావు తెలిపారు.



సెయింట్ పాల్స్ విగ్రహం

సేవా కార్యక్రమాల్లోనూ...

సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి ప్రతి ఏటా చర్చి ప్రాంగణంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. క్రిస్మస్ వేడుకలే కాకుండా ఏడాది పొడవునా పలు కార్యక్రమాలు ఈ చర్చి ప్రాంగణంలో కొనసాగుతుంటాయి. అలాగే ఈ చర్చి ప్రాంగణంతో పాటుగా అనుబంధ చర్చిల్లోనూ ఏటా పలు సామాజిక సేవా కార్యక్రమాలను దాతలు, సంఘాల సాయంతో నిర్వహిస్తున్నట్లుగా చర్చి నిర్వాహకులు వివరిస్తున్నారు.

ప్రతిష్ట మహోత్సవ వేడుకలు



ప్రస్తుత చర్చి ప్రాంగణం

పాతబస్తీలోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి 125వ ప్రతిష్ట వార్షిక వేడుకలు శనివారం ఆ చర్చి ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. 17న జరిగే ప్రతిష్ట మహోత్సవ వేడుకలకు కృష్ణా – గోదావరి అధ్యక్ష ఖండం బిషప్ డాక్టర్ జార్జి కొర్నేలియస్ తంటేపూడి హాజరవుతారు. 125 ప్రతిష్ట మహోత్సవాలను ఆయన ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా ఆనందరావు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో అద్భుత సృజనాత్మకత



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉంటుందని, దానిని వెలికితీస్తే ఉన్నత వంతులుగా తీర్చిదిద్దాలని తెలుగు రచయిత డాక్టర్ వి.సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం, తెలుగు చిత్రకారులు దామెర్ల రామారావు శత వర్ధంతిని పురస్కరించుకుని ఆర్ట్ మేట్ విద్యార్థులచే తెలుగు భాష పై వేసిన చిత్రాల ప్రదర్శన ఆదివారం జరిగింది. గురునానక్‌కాలనీలోని ఆర్ట్ మేట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ చిత్రకళా ప్రదర్శనను రచయిత సత్యవతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు భాషపై మొదటి సారిగా చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులను అభినందించారు. ఆర్ట్ మేట్ చిత్రకళ సంస్థ డైరెక్టర్ ఎ.సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రకళ పట్ల ఆసక్తిని కల్పించడంతో పాటు మన సంస్కృతిని తెలియచేడం ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్నమనేని మురళీ కృష్ణ పాల్గొనా, సీనియర్ చిత్రకారులు పావులూరి చిదంబరం , అమరావతి బాలోత్సవం కార్యదర్శి ఆర్.కొండలరావు, చిత్రకళ ప్రేమికులు ఎం.మధుసూదనరావు పాల్గొని ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుధారాణి, సుష్మా, స్వాతి, రజియా, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు సాధికారత

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ స్థాయిలో ఈ సారి జరిపే జనగణనతో పాటే కులగణన తప్పక జరపాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని టిక్కిల్‌రోడ్డులో ఉన్న కమ్యునిటీ హాలులో ఆదివారం జనగణనలో సమగ్ర కులగణన అనే అంశంపై ఎన్టీఆర్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. త్వరలో విజయవాడ నగరంలో రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, కులగణన చేయాల్సిన ప్రాధాన్యం గురించి కేంద్రంలోని కూటమి ప్రభుత్వానికి కనువిప్పు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. దేశంలో స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు సరైన రిజర్వేషన్లు కేటాయించాలన్నా, జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారసుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా, ఈ సారి జరిపే జనగణనతో పాటే కులగణన చేపట్టాలని కోరారు. కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, ఓబీసీ సబ్‌ప్లాన్ మేరకు బడ్జెట్‌లో నిధులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు, ఇతర ప్రతినిధులు

కేటాయించాలని, ప్రత్యేక రాయితీలతో పథకాలు అమలు చేయాలన్నారు. ఓబీసీ సమాజ సాధికారత సాధించాలన్నా, త్వరలో కేంద్రం జరపబోయే జనగణనతో పాటే సమగ్ర కులగణన చేయడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. గతంలో మోడీతో పాటు, అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్‌లు, ఈ సారి జరిపే జనగణనతో పాటు, ప్రత్యేక ఫార్మేట్‌లో కులం, కాలం పెట్టి దేశంలోని ప్రతి ఒక్కరినీ లెక్కిసామని వాగ్దానం చేశారని, కానీ ఇప్పుడు తాత్కారం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘ ప్రతినిధులు మేకా వెంకటేశ్వరరావు, చెప్పాడ చందు, మహంతి వాసుదేవరావు, కేశవరావు, దూలిపూడి శ్రీనివాస్, గోపి నాగరాజు, రాంబాబు , నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: స్థానిక వీరమ్మతల్లి తిరునాళ్లకు ఆదివారం భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అమ్మవారిని దర్శించుకుని పాట్లేళ్లను కానుకగా సమర్పించారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజా కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వీరమ్మతల్లి చల్లని చూపు, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరినట్టు తెలిపారు.

ముగిసిన మహిళా ఉత్సవ్–2025

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 తేదీ మొదలైన మహిళా ఉత్సవ్–2025 ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని సాధిస్తున్నారని చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన రుణాలు మంజూరు చేయడంతో పాటుగా రుణాల్లో సబ్సిడీలను కూడా కల్పిస్తోందని, ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. మహిళా ఉత్సవ్ పేరుతో ఏటా ఈ విధంగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించి అమ్మకాలు చేయడం అభినందనీయమని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా విక్రయించి వారి అభిరుచులను తెలుసుకునేందుకు మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేసిందన్నారు. స్వయం ఉపాధి కోర్సులను నేర్చుకున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడం వల్ల వారు ఉపాధి పొందడమే కాకుండా మరికొంత మందికి ఉపాధిని కల్పించవచ్చునని చెప్పారు. మహిళా ఉత్సవ్-2025లో స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి అతిధులు సర్టిఫికెట్లను అందచేశారు.



సర్టిఫికెట్లను అందచేస్తున్న శ్రీనివాసరావు, పూర్ణిమ

శ్రీకృష్ణదేవరాయలు ప్రజాపాలన ఆదర్శం

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణదేవరాయలు ప్రజాపాలనను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం దేవరాయలు 554వ జయంతి వేడుకలు, సంప్రదాయ నృత్యాలు, తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. శీలం నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు కవి పండిత పక్షపాతి అన్నారు. ఆయన రచించిన ఆముక్తమాల్యద గ్రంథం తెలుగు సాహిత్యంలో విశిష్టమైనదని పేర్కొన్నారు. కాపు సంఘం నాయకుడు మల్లెమూడి పిచ్చయ్య, సాహిత్య రంగానికి చెందిన డీ దత్తాత్రేయశర్మ, రామతీర్థ, డాక్టర్ బాలకృష్ణ, పవన్‌కుమార్‌రెడ్డి, సత్యబ్రహ్మచారి, డాక్టర్ పూర్ణచంద్రరావు, అంజయ్య, శివకుమార్, నాగరాజులకు పండిత సత్కారం నిర్వహించారు. భాగవతుల వెంకట్రామశర్మ బృందం పలు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. వివిధ రంగాలకు చెందిన అర్జా పాండురంగారావు, బొర్ర రామకృష్ణ, బొబ్బాది చంద్రశేఖర్, చలమలశెట్టి రమేష్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఉదయం బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అతిథులను సత్కరించిన నిర్వాహకులు

క్యాన్సర్ బాధితుల్లో 4 శాతం చిన్నారులే

ఇంటర్నేషనల్ ఛైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే సభలో డాక్టర్ వీణా అక్కినేని

లబ్బీపేట(విజయవాడతూర్పు): వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే చిన్నారుల్లో క్యాన్సర్‌ను నివారించవచ్చని క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ వీణ అక్కినేని అన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో ఆదివారం అంతర్జాతీయ బాల్య క్యాన్సర్‌డే సందర్భంగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడియాట్రిక్ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని మాట్లాడుతూ దేశంలో క్యాన్సర్ బాధితుల్లో నాలుగు శాతం చిన్నారులేనన్నారు. చిన్నారుల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు క్రమంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, సకాలంలో చికిత్స అందిస్తే వారు కోలుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. తరచుగా జ్వరం, బరువు తగ్గడం, తలనొప్పి, ఉదయం వాంతులు చేసుకోవడం, కీళ్ళ నొప్పులు, కడుపు, మెడ,ఛాతీ, చంకల్లో వాపు వంటి లక్షణాలు చిన్న పిల్లల్లో ఉంటే వారిని వెంటనే వైద్యులకు చూపించాలన్నారు. వ్యాధి లక్షణాలను ముందుగా గమనిస్తే బాలలను క్యాన్సర్ బారి నుంచి కాపాడవచ్చని, ఈ వ్యాధి నివారణకు అత్యాధునిక వైద్య ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర చౌదరి మాట్లాడుతూ ఛైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే సందర్భంగా తమ ఆస్పత్రిలో గతంలో క్యాన్సర్ చికిత్స చేయించుకున్న చిన్నారులను వారి తల్లి తండ్రులతో సహా నేటి కార్యక్రమానికి ఆహ్వానించామన్నారు. క్యాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్‌తో సహా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.



క్యాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారులతో రెయిన్‌బో వైద్యులు



దుర్గగుడికి వెళ్లే వాహనాలతో కనకదుర్గ ఫ్లై ఓవర్ కింద ట్రాఫిక్ జామ్



సెల్‌ఫోన్, సామాన్ల కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ

కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఉదయాన్నే కొండపైకి చేరుకున్నారు. వాహనాలతో కనకదుర్గ ఫ్లై ఓవర్ కిటకిటలాడింది. కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది. సెల్‌ఫోన్, సామాన్లు భద్రపరిచే కౌంటర్లు వద్ద కూడా భక్తులు బారులుతీరి కన్పించారు.– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఇంద్రకీలాద్రిపై నెలకొన్న భక్తుల రద్దీ



క్యూలైన్‌లో భక్తులకు మంచినీళ్లు ఇస్తున్న సిబ్బంది

'వయోవృద్ధ' సేవలు ఆదర్శనీయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద వృద్ధులకు సేవలు అందిస్తున్న వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయమని సిద్ధార్థ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు కట్టా జనార్ధనరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యాన దాత బాలిరెడ్డి ఆనంద్‌రెడ్డి సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఆధారం లేని నిరుపేద వయోవృద్ధులను గుర్తించి ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందించడంతోపాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం భారత వికాస పరిషత్ ఆధ్వర్యాన వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ ఛైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, క్లబ్ సెక్రటరీ కాట్రగడ్డ నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, పులిపాక కృష్ణాజీ, ట్రస్టీలు తట్టి అర్జునరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.